సాక్షి సూర్యాపేట


సూర్యాపేటలో పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది


దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్‌చైర్

గురువారం । 30 । నవంబర్ । 2023

న్యూస్‌రీల్

ఎంజీయూ ద్వైమాస పత్రిక ఆవిష్కరణ


పత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, న్యాయవాదులు తదితరులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం విస్తృత ద్వైమాస పత్రికను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంజీయూ తెలుగు విభాగం, అనంతుడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోత్కూరి శ్రీనివాస్ సంపాదకత్వంలో సమకాలిన సామాజిక, సాహిత్య దర్పనంగా సంకలనం చేసి విస్తృత ద్వైమాస పత్రిక పేరుతో ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ పత్రికలో తెలుగు సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక అంశాలను చేర్చి ప్రజల ముందుకు తేవడం అభినందనీయమన్నారు. ఈ పత్రికలో ప్రచురణకు సామాజిక స్పృహ కలిగిన వ్యాసాలు, కవితలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భీమార్జున్‌రెడ్డి, శ్యాంసుందర్, గంగాధర్, నర్సింహ, ఆనంద్, సత్యనారాయణరెడ్డి, అనిత పాల్గొన్నారు.

నేడు కార్మికులకు సెలవు

భువనగిరి టౌన్ : అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని గురువారం వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తున్నట్లు కార్మిక శాఖ ఉమ్మడి నల్లగొండ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక శాఖ జారీ చేసిన జీఓ నంబర్ 594, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో గల అన్ని కర్మాగారాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సెలవు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

యాదాద్రిలో విశేష పూజలు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం నిత్యపూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు గావించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.20,10,595 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రంలోకి వీరికే అనుమతి

భువనగిరి: పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి అనే దానిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది. నిబంధనల ప్రకారమే ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్, పోలింగ్ ఏజెంట్‌కు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతి ఉంది. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక పరిశీలకులు, ప్రక్రియను చిత్రీకరించేవారు, సమస్యాత్మక కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ పర్యవేక్షించేవారు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లవచ్చు. ఎన్నికల సంఘం అనుమతి పొందిన మీడియా ప్రతినిధులకు ఈసారి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు అవకాశం కల్పించారు. దివ్యాంగులు, అంధ ఓటర్లకు సహాయకులుగా వచ్చే వ్యక్తులు వారి వెంట పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు వీలు ఉంటుంది. అనుమతి లేని వారు కేంద్రంలోకి వెళ్తే కేసులు నమోదు చేస్తారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

ఎన్నికల విధులపై వచ్చే పోలీసులకు శాంతిభద్రతల సమస్య తలెత్తితే తప్ప అనవసరంగా బూత్‌లోకి వెళ్లేందుకు అనుమతి లేదు. జెడ్ ప్లస్ భద్రత ఉన్న వ్యక్తితో పాటు వారి వెంట వచ్చే వారికి అనుమతి ఉంటుంది. ఇతర భద్రతా సిబ్బంది పోటీ చేసే అభ్యర్థి వెంట వచ్చే వారికి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశం లేదు. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల వెంట వచ్చే వారికి కూడా కేంద్రంలోకి అనుమతి లేదు. ఎన్నికల సంఘం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటారు.


సూర్యాపేటలో పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

ఓటుకు వేళాయే!

నేడే ఓటరు తీర్పు.. పోలింగ్ నిర్వహణకు అంతా సిద్ధం

- నాలుగు నియోజకవర్గాల్లో 9,85,962 మంది ఓటర్లు
- బరిలో 92మంది అభ్యర్థులు
- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- ఉదయం 7గంటల నుంచి 5గంటల వరకు పోలింగ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు ఓటు వేసేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను అధికారులు చేపట్టారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో పాటు ఇతర పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది తమకు విధులు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,201 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో జిల్లాలోని 9,85,962 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఓటర్లు ఇలా...

సూర్యాపేట నియోజకవర్గంలో 2,41,799 మంది ఓటర్లు, కోదాడ నియోజకవర్గంలో 2,41,554మంది, తుంగతుర్తి నియోజకర్గంలో 2,55,017, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,47,592 మంది ఓటర్లు ఇలా మొత్తం 9,85,962 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

సాయంత్రం 5గంటల లోపు పోలింగ్ కేంద్రంలో ఉంటేనే..

జిల్లాలో గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఓటు వేసే వారు 5 గంటల లోపు పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఆలస్యం అయితే లోపలికి అనుమతి ఉండదు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ మూడో తేదీన చేపడతారు.. అదే రోజున ఫలితాలు ప్రకటిస్తారు

5,772 మంది పోలింగ్ సిబ్బంది

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో పీఓ, ఏపీఓ, ఓపీఓలు కలిపి 5,772 మందిని కేటాయించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 308 పోలింగ్ కేంద్రాలకు 1,480 మంది, కోదాడలోని 296 పోలింగ్ కేంద్రాలకు 1,424 మంది, సూర్యాపేటలోని 271 పోలింగ్ కేంద్రాలకు 1,304 మంది, తుంగతుర్తిలోని 326 పోలింగ్ కేంద్రాలకు 1,564 మందిని కేటాయించారు. 1201 పోలింగ్ కేంద్రాలకు 2, 979 బ్యాలెట్ యూనిట్లు, 1508 కంట్రోల్ యూనిట్లు, 1,695 వీవీ ప్యాట్లను కేటాయించారు.

112 రూట్లు.. 1,076 వాహనాలు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 112 రూట్లు ఏర్పాటు చేశారు. 1,076 వాహనాలు కేటాయించారు. ప్రతి రూట్‌కు ఒక సెక్టోరియల్ అధికారిని నియమించారు. ప్రతి వాహనానికి జీపీఎస్ అమర్చారు. హుజూర్‌నగర్‌లో 29 రూట్లు ఏర్పాటు చేసి 38 పెద్ద బస్‌లు, 17 చిన్న బస్‌లు, 35 కార్లు, 176 ఆటోలు, 3 కంటేనర్లు మొత్తం 269 ఏర్పాటు చేశారు. కోదాడలో 25 రూట్లు ఏర్పాటు చేసి, పెద్ద బస్సులు 28, చిన్న బస్సులు 28, కార్లు 28, ఆటోలు 190 , కంటేనర్ల 3 ఇలా మొత్తం 277 ఏర్పాటు చేశారు. సూర్యాపేటలో 24 రూట్లు ఏర్పాటు చేసి పెద్ద బస్సులు 24, చ్ని బస్సులు 24, కార్లు 24, ఆటోలు 166 ఇలా మొత్తం 238 ఏర్పాటు చేశారు. తుంగతుర్తిలో 34 రూట్లు ఏర్పాటు చేసి పెద్ద బస్సులు 34, చిన్న బస్సులు 25, కార్లు 34, ఆటోలు196, కంటేనర్లు 3 ఇలా మొత్తం 292 ఏర్పాటు చేశారు.

సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

జిల్లాలో మొత్తం 353 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలు, ఘర్షణల ఆధారంగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. సూర్యాపేట నియోజకవర్గంలో 70, తుంగతుర్తిలో 106, కోదాడలో 86, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 91 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నారు.

బ్యాలెట్ యూనిట్ల వినియోగం ఇలా..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గాను తుంగతుర్తి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఒక్కటి చొప్పున బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నారు. అలాగే హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు రెండు చొప్పున, కోదాడ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లు వాడుతారు.


సూర్యాపేట డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

పోటీలో 92 మంది

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కలిపి 92 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. హుజూర్‌నగర్‌లో 24 మంది, కోదాడలో 34 మంది, సూర్యాపేటలో 20 మంది, తుంగతుర్తిలో 14 మంది పోటీ పడుతున్నారు. ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు బీఎస్పీ పోటీ పడుతుండగా ఇతర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మొత్తం ఓటర్లు	9,85,962
పురుషులు	4,84,747
మహిళలు	5,01,157
ఇతరులు	58
నియోజకవర్గాలు	04
పోలింగ్ కేంద్రాలు	1201
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	353
ఆదర్శ పోలింగ్ కేంద్రాలు (దివ్యాంగుల 04 . మహిళా 20. మోడల్ 20. యూత్ 04)	48
పీఓలు	1,443
ఏపీఓలు	1,443
ఓపీఓలు	2,886
మైక్రోఅబ్జర్వర్లు	210
బ్యాలెట్ యూనిట్లు	2,979
కంట్రోల్ యూనిట్లు	1,508
వీవీ ప్యాట్లు	1,695


సూర్యాపేట బేబీమూన్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది


జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో మహిళల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్ అన్నారు. బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ నిర్వహణకు పటిష్ట భద్రత కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలకు వినియోగిస్తున్న వాహనాలతో పాటు సెక్టార్ అధికారుల వాహనాలకు కూడా జీపీఎస్ అనుసంధానం చేశామని ఆయా నియోజక వర్గాలతో పాటు జిల్లా స్థాయిలో కూడా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లాలో 3,500 మంది పోలీస్ బృందాలు ఏర్పాటు చేశామని పోలింగ్, కౌంటింగ్‌కు జిల్లా అంతటా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికే జిల్లాలోని నాలుగు నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 1,201 పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో సిబ్బందితో పాటు పోలింగ్ సంబంధించిన మెటీరియల్ అంతటినీ పంపినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోలింగ్ అనంతరం జిల్లా పరిధిలో ఆర్‌టీసీ ప్రయాణం ఉచితంతో పాటు హైదరాబాద్‌కు పోయే సిబ్బంది సాధారణ చార్జెస్‌తో వెళ్లొచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అర్హులైన 16,739 మంది వికలాంగులకు 1,201 పోలింగ్ కేంద్రాల్లో 728 ప్రాంతాల్లో 708 వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాని, అలాగే 728 మంది వలంటర్లను నియమించి సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి, ఆర్‌డీఓ వీరబ్రహ్మాచారి, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


సూర్యాపేటలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

నిధులు మంజూరయ్యేదెప్పుడో..

- శిథిలావస్థలో నీటి పారుదల శాఖ కార్యాలయం
- ప్రతిపాదనలు పంపినా మంజూరు కాని నిధులు
- భవనం కూలేందుకు సిద్ధంగా ఉందని సిబ్బంది ఆందోళన


నడిగూడెంలో శిథిలావస్థలో ఉన్న నీటి పారుదల శాఖ కార్యాలయం

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని నీటి పారుదల శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. సాగర్ కాలువ నిర్మాణ సమయంలో 60 ఏళ్ల కిందట అధికారుల విశ్రాంతి కోసం నాడు ఈ భవనాన్ని నిర్మించారు. గత 20 సవత్సరాలుగా ఈ భవనాన్ని నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. భవనం పాతకాలం నాటిది కావడంతో ఇప్పటికే పలు చోట్ల కూలింది. అయినా సంబంధిత అధికారులు ఈ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవనం నిర్మాణానికి సంబంధిత అధికారులు గతంలో రూ.30 లక్షలు నిధుల కోసం ప్రతిపాదనలు కూడా పంపారు. అయినా నిధులు మంజూరు కాలేదు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని సంబంధిత సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటినైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బుధవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్కర పూజ మాంగళ్యధారణ తదితర కార్యక్రమాలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో చెన్నూరు విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, అంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


మట్టపల్లిలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సుకు ఏర్పాట్లు షురూ


దర్గాకు రంగులు వేస్తున్న పెయింటర్

అర్వపల్లి: అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. డిసెంబర్ 8, 9 తేదీలలో రెండు రోజుల పాటు ఉర్సు జరగనుంది. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. దర్గాకు రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. అలాగే దర్గా లోపల అలంకరణ పనులు చేపట్టారు. ఉత్సవాల వరకు ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు దర్గా ముజావర్ ఎస్‌కె. అలీ తెలిపారు.

నాలుగు వేల మందితో పటిష్ట భద్రత


మాట్లాడుతున్న ఎస్పీ


సూర్యాపేట డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల విధులకు వెళ్తున్న పారామిలటరీ సిబ్బంది

- ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం : ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4వేల మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నట్లు చెప్పారు. అంతర్ రాష్ట్ర సరిహద్దు వెంట 7 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, 7 అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలువైన ఆభరణాలు రవాణా జరగకుండా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన, ట్రబుల్స్ మాంగర్స్ గా గుర్తించిన 4,000 మందికి పైగా వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. పెండింగ్ లో ఉన్న 460 వారెంట్ లు సర్వ్ చేసినట్లు చెప్పారు. 155 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పారామిలిటరీ సిబ్బందితో నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల రోజు ఎస్ఐ, సీఐల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్, డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్ పని చేస్తాయన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా 381ఫిర్యాదులు స్వీకరించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనుమతులకు సంబంధించి ఎన్-కోర్ ఆన్లైన్ ద్వారా వచ్చిన 1,281 పిటిషన్లు పరిశీలించి 913 అనుమతులు ఇచ్చామన్నారు. పేటలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేసి విధులను పర్యవేక్షిస్తున్నామన్నారు.

33 కేసులు నమోదు

ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి మొత్తం 33 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.3 . 36 కోట్ల డబ్బు, రూ.23 లక్షల విలువగల 4300 లీటర్ల మద్యం, 1500 కేజీల బెల్లం, 344 కేజీల పటిక, 50 లక్షల విలువగల 200 కేజీల గంజాయి, 1 కోటి 29 లక్షలు విలువగల 283 గ్రాముల బంగారం, 145 కేజీల సిల్వర్, కోటి 12 లక్షలు విలువగల ఎలక్ట్రానిక్, వస్త్రాలు సీజ్ చేసినట్లు వివరించారు. ఇలా ఇప్పటి వరకు మొత్తం 6. 50 కోట్లు విలువగల అక్రమ రవాణాను అడ్డుకుని సీజ్ చేశామని ఎస్పీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

భువనగిరిటౌన్: భువనగిరిలో ఉర్సును ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి పట్టణంలోని జమాలే బహార్‌దర్గా గంధం ఊరేగింపు నిర్వహించారు. దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోలన్ ప్రవీణ్‌రెడ్డి,సామ రాజేందర్‌రెడ్డి, చామల భానుచందర్‌రెడ్డి, చామాల ఉదయ్ చందర్‌రెడ్డి ప్రార్థనలు నిర్వహించారు.

హనుమంతరావు సేవలు మరువలేనివి

హుజూర్‌నగర్ : రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వంగవీటి హనుమంతరావు చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించిన హనుమంతరావు సంతాప సభలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు సహాయం చేయడంతో పాటు సామాజిక సేవ చేయడంలోనూ ముందుండేవారని కొనియాడారు. హనుమంతరావు మృతి పెన్షనర్ల సంఘానికి తీరని లోటని అన్నారు. ఆయన కృషి ఫలితంగా అనేక ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు సమకూరాయని తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు చెన్న సోమయ్య, రాంబాబు, కొప్పుల వీరా రెడ్డి, అంకతి అప్పయ్య, ఎండి మొహినుద్దీన్, దేవదానం, రఘునాథ్, జూలకంటి నర్సిరెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, చంద్ర శేఖర్, చంద్రయ్య, లక్ష్మయ్య, వేముల వెంకటేశ్వర్లు, ఓరుగంటి నరసయ్య పాల్గొన్నారు.


సంతాప సభలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య


హాలియా పట్టణంలోని ఐటీఐ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ కర్ణన్


భువనగిరి అరోరా కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న యాదాద్రి కలెక్టర్ హనుమంతు కె. జెండగే, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు


సూర్యాపేట పట్టణంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్


ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేసేందుకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లోని స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలను బయటకు తీసుకొస్తున్న సిబ్బంది


భువనగిరిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది


భువనగిరిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ఎన్నికల సిబ్బంది


సూర్యాపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది


నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రితో వెళ్తున్న మహిళా సిబ్బంది

జంగ్ తెలంగాణ


నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న కేంద్ర బలగాల సిబ్బంది


భువనగిరి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది


నల్లగొండ పట్టణంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


భువనగిరిలోని అరోరా కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని చెక్ చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది


నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద రిపోర్ట్ చేస్తున్న ఎన్నికల సిబ్బంది


నల్లగొండలోని ఎన్జీ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ మిషన్లను సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించవచ్చు

నల్లగొండ, త్రిపురారం: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం ఓటేసేందుకు ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు) తప్పనిసరని లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 కార్డుల్లో ఏదేని ఒక గుర్తింపు కార్డు ఉండాలని నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్ తెలిపారు. 1. ఆధార్ కార్డు, 2. ఉపాధి హామీ జాబ్ కార్డు, 3. బ్యాంకు/తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటో పాస్‌బుక్, 4. కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, 5. డ్రైవింగ్ లైసెన్స్ 6.పాన్ కార్డు, 7. రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా(ఆర్జీఐ) జారీ చేసిన స్మార్ట్ కార్డు, 8. భారతీయ పాస్‌పోర్ట్ 9. ఫొటో గల పెన్షన్ పత్రాలు, 10. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు, 11.ఎంపీలు/ ఎమ్మెల్యేలు/ ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు 12. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒకటి ఉండాలని పేర్కొన్నారు.

● ఈ పోలింగ్ కేంద్రాలు 'స్పెషల్'


నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం


నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం



నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో ఏర్పాటు చేసిన యువతరం పోలింగ్ స్టేషన్


నల్లగొండ పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రం

పోలీసు శాఖకు సహకరించండి

చౌటుప్పల్ : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని రాచకొండ క్రైమ్ డీసీపీ అరవింద్‌కోరారు. చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. బందోబస్తుపై పోలీసులు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 72 పోలింగ్ కేంద్రాలకు గాను 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 11 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ పారామిలటరీ బలగాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట నోడల్ అధికారి మొగిలయ్య, సీఐ ఎస్.దేవేందర్, ఎస్సైలు ఉన్నారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు


గట్టుప్పల్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ స్టేషన్

చండూరు(గట్టుప్పల్) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు మునుగోడు నియోజకవర్గంలో 12 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మహిళా పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గంలోని చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గట్టుప్పల్ గ్రామ పంచాయతీ కార్యాలయం, నారాయణపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చండూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లకినేనిగూడెం, నాంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేటలో ఏర్పాటు చేశారు. యూత్ పోలింగ్ కేంద్రాన్ని చండూర్ మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆదర్శ పోలింగ్ కేంద్రాలను చౌటుప్పల్ మండలంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల బీసీ కాలనీ, నారాయణపురం మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మునుగోడు మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోటయ్యగూడెం, మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.

ప్రమాణం చేయించి డబ్బుల పంపిణీ!



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీల నేతలు ప్రలోభాల పర్వానికి తెర తీశారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులు ప్రచారం సందర్భంలోనే ఓటర్లకు కొన్ని రకాల హామీలను ఇస్తూ వచ్చారు. వాటితో పాటు కులాలు, సంఘాలు, అసోసియేషన్ల వారీగా విందు భోజనాలను కూడా ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం ప్రచారం ముగియడంతో ఆ రాత్రి నుంచే ప్రలోభాలు మొదలయ్యాయి. మద్యం, డబ్బుల పంపిణీతో పాటు కిలో చికెన్ చొప్పున అందజేసినట్లు తెలిసింది. పురుషులకు మద్యం, మహిళలకు కూల్‌డ్రింక్స్, డబ్బులు పంపిణీ చేసినట్లు సమాచారం. కొందరు అభ్యర్థులు ఇప్పటికే ఓటుకు వేయి రూపాయల చొప్పున పంపిణీ చేసినట్లు చెబుతుండగా, ఒక నియోజకవర్గంలోని అభ్యర్థి డబ్బులు ఇవ్వలేక మిన్నకుండిపోయారని చర్చించుకుంటున్నారు. మరికొన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మరో నియోజకవర్గంలో దేవుడి తోడు మీ గుర్తుకే ఓటేస్తానని ఓటర్లతో ప్రమాణం చేయించుకొని డబ్బులు ఇచ్చిన సంఘటనలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. మరికొందరు పక్క వార్డులో ఇచ్చి మాకెందుకు ఇవ్వరంటూ అభ్యర్థులను నిలదీసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మొత్తానికి గురువారం ఓటర్లను ప్రసన్నం చేసుకునే ఆలోచనల్లో అభ్యర్థులు ఉన్నారు.

ఓటర్ల తరలింపు అభ్యర్థులకు భారం..

ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం అభ్యర్థులకు భారంగా మారింది. రవాణా ఖర్చులు భరించడంతో పాటు ఓటుకు కూడా అంతో ఇంతో అప్పజెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అభ్యర్థులకు ఖర్చు పెరిగిపోతోంది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చౌటుప్పల్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఓటు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

రూ.4.95లక్షల నగదు స్వాధీనం

హాలియా: వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.4.95 లక్షల నగదును బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు హాలియా ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు. హాలియా సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుముల, మదార్‌గూడెం గ్రామాలకు చెందిన ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఓ కాంగ్రెస్ కార్యకర్త వాహనంలో నగదును తరలిస్తుండగా సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు భారీ బందోబస్తు


మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ

నల్లగొండ క్రైం: అసెంబ్లీ సాధరణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేదుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. పోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, పారా మిలటరీ బలగాలకు బుధవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో కేంద్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ విజయ్‌సింగ్ మీనాతో కలిసి ఎన్నికల విధి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో 5 వేల మంది భద్రతా సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. 586 సమస్యాత్మక ప్రాంతాలపైన పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు నల్లగొండ నియోజక వర్గాన్ని 28 రూట్లుగా, సాగర్‌ను 32, దేవరకొండను 31, మిర్యాలగూడను 30, మునుగోడును 30, నకిరేకల్ నియోజకవర్గాన్ని 29తో కలిపి మొత్తం 180 రూట్లుగా విభజించామన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తితే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రత్యేక పోలీస్ బలగాలను సిద్ధంగా ఉంచామన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు


ఆలేరు రూరల్: పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఆలేరురూరల్: పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఓ జి.వీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని ఎనమిది మండలాల పరిధిలో గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. మొత్తం 36 రూట్లలో 309 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఇందులో మహిళా పోలింగ్ స్టేషన్, వికలాంగుల పోలింగ్ స్టేషన్, మోడల్ పోలింగ్ స్టేషన్‌లు రెండు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐడింటిఫికేషన్ అధికారులతో పాటు ఇతర అధికారులు సిబ్బంది మొత్తం కలిపి 1650 మంది ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,32,266 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఇందులో పురుషులు 1,16,708 మంది కాగా మహిళలకు 1,16,539 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 19 మంది ఉన్నారని తెలిపారు. సజావుగా ఎన్నికల జరిగేందుకు 160 కేంద్రాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో గట్టి భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.